
సాక్షి
కుమురం భీం

ఆదివారం, 25, మే, 2025

సాహిత్యంలో 'అరుణ' కిరణం!



ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలం రికి చెందిన ఉపాధ్యాయురాలు అరుణ బట్టువార్ ప్రాథమిక స్థాయి విద్యార్థులను బాల కవులు, సాహిత్యవేత్తలుగా తీర్చిదిద్దేందుకు విశేష కృషి చేస్తున్నారు. హైదరాబాద్‌లో తెలంగాణ సారస్వత పరిషత్‌లో సత్కారం పొందనున్నారు. 8లో▸



పశుపోషకులకు అండగా..

ఉపాధిహామీ పథకంలో భాగంగా పశువుల పెడ్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గ్రామీణప్రాంతాల్లో జాబ్‌కార్డు కలిగి ఉన్న పాడి రైతులు ఇందుకు అర్హులు. 9లో▸

గరిష్టం/కనిష్టం
32.6 /26.4

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంకన్నా తక్కువగా నమోదవుతాయి. ఉపరితల ఆవర్తనం ప్రభావంతో అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

26 నుంచి లైసెన్స్‌డ్ సర్వేయర్లకు శిక్షణ

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో ఎంపికైన లైసెన్స్‌డ్ సర్వేయర్లకు ఈనెల 26వ తేదీ నుంచి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు సర్వే అండ్ ల్యాండ్ రికార్ప్ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ సోమేశ్వర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా నుంచి 190 మంది దరఖాస్తులు చేసుకోగా రాష్ట్ర ప్రభుత్వం మొదటి విడతలో భాగంగా 107 మందిని ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఎంపికైన వారికి సోమవారం నుంచి ధ్రువపత్రాల పరిశీలన, శిక్షణ తరగతులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. శిక్షణా తరగతులను జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ రైతువేదికలో 50 రోజుల పాటు (పని దినాలలో) ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ అనంతరం తుది పరీక్ష నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు.

ముగిసిన ఉపాధ్యాయుల శిక్షణ



మాట్లాడుతున్న ఎస్‌వో శ్రీనివాస్

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో రెండోదశ ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ శ్రీనివాస్ ముగింపు కార్యక్రమంలో పాల్గొని పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కనీస సామర్థ్యాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. జిల్లా రిసోర్స్ పర్సన్‌లు చెప్పే అంశాలను పాఠశాలల్లో కొనసాగించాలన్నారు. బోధన, అభ్యసన సామగ్రి ఉపయోగించి విద్యా బోధన చేయాలని, వచ్చే సంవత్సరం నుంచి ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ ద్వారా విద్యా బోధన ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల్లో విద్యా ప్రమాణాల పెంపు కోసం ప్రతీ ఉపాధ్యాయుడు కృషి చేయాలన్నారు. రిసోర్స్ పర్సన్ అమరేందర్, అనురాధ భాయ్, రమేశ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలల సంరక్షణకు పాటుపడాలి



అవగాహన కల్పిస్తున్న అధికారి మహేశ్

ఆసిఫాబాద్‌రూరల్: బాలల సంరక్షణకు ఉపాధ్యాయులు కృషి చేయాలని డీసీపీవో మహేశ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో రెండో విడత ఉపాధ్యాయుల శిక్షణలో భాగంగా టీచర్లకు పోక్సో చట్టం 2012పై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ లైంగిక దాడులకు గురైన బాలలను గుర్తించడానికి అనుసరించే విధానాలపై సూచనలు చేశారు. సమస్యలను పరిష్కరించుకునేందుకు 1098 హెల్ప్‌లైన్‌ను వినియోగించేలా వారికి మెలుకువలు నేర్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ ప్రవీణ్ కుమార్, వెంకటేశ్వర్లు, టీచర్లు పాల్గొన్నారు.

బియ్యం అమ్ముకుంటే రేషన్‌కార్డు రద్దు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న కేశవరావు

ఆసిఫాబాద్‌రూరల్: రేషన్ బియ్యం అమ్ముకునే వారి రేషన్‌కార్డులు రద్దు చేయాలని రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు కేశవరావు అన్నారు. ఈమేరకు శనివారం అదనపు కలెక్టర్ డేవిడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలకు చెందిన కొందరు పట్టణ ప్రాంతంలోని డీలర్ల వద్ద రేషన్ బియ్యం తీసుకుని, తిరిగి ఆ డీలర్లకే విక్రయిస్తున్నారన్నారు. అలా జరగకుండా రేషన్ కార్డుదారులు సంబంధిత రేషన్ షాపులోనే బియ్యం తీసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

భర్తీకి ముందే బేరసారాలు!



- ఔట్‌సోర్సింగ్ పోస్టుల భర్తీలో అవకతవకలు
- మెరిట్‌లిస్ట్ విడుదల చేసిన మెడికల్ కాలేజీ
- అభ్యర్థులకు వల వేస్తున్న దళారులు
- ఒక్కో పోస్టుకు రూ.లక్షల్లో వసూళ్లు

సాక్షి, ఆసిఫాబాద్: ఆసిఫాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాలలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిన వివిధ పోస్టులు భర్తీ చేసేందుకు అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ ప్రారంభించింది. ఇందులో భాగంగా వైద్య కళాశాల మెరిట్‌లిస్ట్ విడుదల చేసింది. మెరిట్‌లిస్ట్‌లోని అభ్యర్థులతో కొందరు దళారులు పోస్టులు ఇప్పిస్తామంటూ బేరసారాలు చేస్తుండటం విమర్శలకు తావిస్తోంది. పోస్టును బట్టి ఒక్కో అభ్యర్థి నుంచి రూ. లక్ష నుంచి రూ.2.50 లక్షల వరకు వసూళ్లు చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే కొందరు అభ్యర్థుల నుంచి దళారులు డబ్బులు వసూలు చేసినట్లు తెలుస్తోంది. అయితే మెరిట్‌లిస్ట్‌ను ప్రకటించిన మెడికల్ కాలేజీ పోస్టులను నేటి వరకు భర్తీ చేయలేదు. రెండు, మూడు రోజుల్లో తుది జాబితా విడుదల చేయనున్నారు. ఈలోపే దళారులు రంగంలోకి దిగి బేరసారాలు చేస్తుండటంపై అనేక విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఎంపిక ప్రక్రియలో మార్పులు..

ప్రభుత్వం వైద్య కళాశాలలో వివిధ రకాల 52 పోస్టులను ఔట్‌సోర్సింగ్ ద్వారా భర్తీ చేసుకునేందుకు అనుమతి ఇచ్చింది. కాగా గతంలో వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో కలెక్టర్ వెంకటేశ్ దోత్రే ఈసారి ఔట్‌సోర్సింట్ పోస్టుల ఎంపిక ప్రక్రియ విధానంలో మార్పులు తీసుకొచ్చారు. గతంలో ఈ పోస్టులకు అభ్యర్థుల ఎంపికను ఏజెన్సీలే చేపట్టేవి. ఏజెన్సీల నిర్వాహకులు అభ్యర్థుల నుంచి డబ్బులు తీసుకుని పోస్టులు భర్తీ చేసేవారన్న ఆరోపణలు ఉన్నాయి. తాజాగా జనవరిలో 52 పోస్టుల కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతూ కలెక్టర్ ఒక ప్రకటన విడుదల చేశారు. అయితే దరఖాస్తులను అభ్యర్థులు నేరుగా వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌కు అందజేయాలని సూచించగా, వేలాది దరఖాస్తులు వచ్చాయి.

నాలుగు నెలలుగా నాన్చుడే..

అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించి నాలుగు నెలలు గడుస్తున్నా నేటికీ అర్హుల జాబితాను ప్రకటించకపోవడం జిల్లా ఉన్నతాధికారుల చిత్తశుద్ధికి నిదర్శనంగా నిలుస్తోంది. వైద్య కళాశాల విడుదల చేసిన మెరిట్‌లిస్ట్‌లో అత్యధికంగా డేటా ఎంట్రీ పోస్టుకు 552 మంది పోటీ పడుతున్నారు. తరువాతి స్థానం ల్యాబ్ అటెండెంట్ పోస్టుది. దీనికి 223 మంది పోటీలో ఉన్నారు. ఎలక్ట్రీషియన్‌కు 100 మంది, వార్డ్‌బాయ్‌కు 69, అనస్థీషియా టెక్నీషియన్‌కు 48, థియేటర్ అసిస్టెంట్‌కు 43, రేడియోగ్రఫీ టెక్నీషియన్‌కు 27, సిటీస్కాన్‌కు 24, డ్రైవర్‌కు 14, ఈసీజీ టెక్నీషియన్‌కు 13, గ్యాస్ ఆపరేటర్‌కు 10 మంది చొప్పున మెరిట్‌లిస్ట్‌లో ఉన్నారు. అయితే జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా ఉన్న జిల్లా సెలెక్షన్ కమిటీ మెరిట్‌లిస్ట్ నుంచి 52 మంది అభ్యర్థులను ఎంపిక చేయాల్సి ఉంది. అయితే మెరిట్‌లిస్ట్ విడుదలై రోజులు గడుస్తున్నా అభ్యర్థులను ఎంపిక చేయకపోవడం వెనుక రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయని, అందుకే జాప్యం జరుగుతోందన్న వాదన వినిపిస్తోంది.

దళారుల ఎంట్రీ..

వాస్తవంగా ఎంపిక ప్రక్రియ ఎలా జరిగినా.. చివరకు అభ్యర్థులకు వేతనాలు ఇచ్చేది ఏజెన్సీలే. దీంతో అర్హుల జాబితా విడుదల తరువాత కొన్ని ఏజెన్సీలకు ఈ పోస్టులను అప్పగిస్తారని తెలుస్తోంది. ఇందుకోసం మూడు ఏజెన్సీలు ముందుకు వచ్చినట్లు సమాచారం. ఆదిలాబాద్‌కు చెందిన ఓ ఏజెన్సీ ఇద్దరు రాష్ట్ర మంత్రుల ద్వారా సిఫార్సు చేయించుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పుడా ఏజెన్సీలు దళారులను రంగంలోకి దింపి ఒక్కో పోస్టును రూ. లక్షల్లో బేరం పెట్టినట్లు సమాచారం ఉంది.

ఎవరినీ నమ్మొద్దు..

ప్రభుత్వ వైద్య కళాశాలలో ఔట్‌సోర్సింగ్ పోస్టుల భర్తీ ప్రక్రియ పారదర్శకంగానే జరుగుతుంది. వైద్య కళాశాల ఉద్యోగుల పేరు చెప్పి ఎవరైనా దళారులు పోస్టులు ఇప్పిస్తామని చెబితే నమ్మొద్దు. మా పేర్లు చెప్పి డబ్బులు అడిగితే నేరుగా నాకు ఫిర్యాదు చేయండి. వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– శ్రీలక్ష్మి, ప్రిన్సిపాల్, ప్రభుత్వ వైద్య కళాశాల

అటవీ అనుమతుల జారీకి ప్రత్యేక చర్యలు

- రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ



వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రులు సురేఖ, సీతక్క

ఆసిఫాబాద్‌రూరల్: రాష్ట్రంలో అభివృద్ధి పనులకు అవసరమైన అటవీ అనుమతుల జారీకి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి మంత్రి సీతక్క, అటవీ శాస్త్రసాంకేతిక శాఖ కార్యదర్శి నదీంతో కలిసి కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఆర్‌డీవో లోకేశ్వర్, సంబంధిత జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ అటవీ శాఖ అనుమతుల జారీ, అటవీ ప్రభావిత ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజనుల మౌలిక సదుపాయాల కల్పన కోసం చర్యలు తీసుకుంటున్నామన్నారు. పంచాయతీరాజ్, రోడ్లు భవనాల పరిధిలో చేపట్టే రహదారి నిర్మాణ పనులకు అటవీ శాఖ అధికారులు సహకరించాలని పేర్కొన్నారు. జిల్లా అటవీ అధికారులతో సమీక్షించి చేపట్టిన చర్యలు, పనుల పురోగతిపై ఈ నెల 28వ తేదీలోగా నివేదిక అందించాలని సూచించారు. కలెక్టర్ వెంకటేశ్‌దోత్రే మాట్లాడుతూ గిరిజన ప్రాంతాలను అనుసంధానం చేస్తూ జిల్లాలో చేపట్టే రహదారుల అభివృద్ధి పనులలో అవసరమైన అటవీ అనుమతుల కోసం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పరీక్ష సమర్థవంతంగా నిర్వహించాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

ఆసిఫాబాద్‌రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా ఆదివారం జరగనున్న గ్రామ పాలన అధికారి పరీక్షను సమర్థవంతంగా నిర్వహించాలని సీసీఎల్‌ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ అన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 25న ఉదయం 10.30 గంటల నుంచి 1.30 గంటల వరకు జరిగే గ్రామ పాలన అధికారి పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. నోడల్ అధికారి ఆధ్వర్యంలో పూర్తి స్థాయి ఏర్పాట్లు చేయాలన్నారు. ఉదయం 8 గంటల వరకు జవాబు పత్రాలు, 9.20 గంటల వరకు ప్రశ్నపత్రాలు తరలించాలని తెలిపారు. పరీక్ష ముగిసిన తరువాత జవాబు పత్రాలను సరిగ్గా సీల్ చేసి జేఎన్‌టీయూహెచ్‌కు తరలించాలని పేర్కొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో పరీక్ష నిర్వహణ కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. జిల్లా కేంద్రంలోని సాంఘిక సాంక్షేమ గురుకుల పాఠశాలలో పరీక్ష సెంటర్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఆర్‌డీవో లోకేశ్వర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఖాళీ బిందెలతో మహిళల రాస్తారోకో



ఖాళీ బిందెలతో రాస్తారోకో చేస్తున్న మహిళలు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని బురదగూడ గ్రామానికి గత కొద్దిరోజులుగా మిషన్ భగీరథ నీరు రావడంలేదని శనివారం కాగజ్‌నగర్ –ఆసిఫాబాద్ ప్రధాన రహదారిపై గ్రామస్తులు ఖాళీ బిందెలతో రాస్తారోకో చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గత కొద్దిరోజులుగా తమకు మిషన్ భగీరథ నీరు రావడంలేదని, ఈ విషయాన్ని అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని ఆరోపించారు. వెంటనే తమ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాస్తారోకో చేపట్టారు. దీంతో రహదారికి ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. ఎంపీడీవో కోట ప్రసాద్ స్పందించి గ్రామానికి చేరుకుని పరిశీలించారు. బురదగూడ గ్రామానికి గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ట్రాక్టర్లతో నీటిని సరఫరా చేశారు. అదేవిధంగా పంచాయతీ ఆధ్వర్యంలో తాగునీరు సరఫరా అయ్యేలా ఏర్పాట్లు చేశారు.

కష్టాల కడలిలో కౌలు రైతు

- పెరిగిన విత్తన, ఎరువుల ధరలు
- ఏటా పెరుగుతున్న కౌలు
- పంట విక్రయంలోనూ ఇబ్బందులు
- జిల్లాలో 30వేలకు పైగా కౌలు రైతులు



తిర్యాణి: జిల్లాలోని కౌలు రైతులకు ఏటా కష్టాల కడలి ఈదక తప్పడం లేదు. పెరుగుతున్న కౌలు ధరలతో పాటు ఎరువులు, విత్తనాల ధరలు పెరుగుతుండడంతో వారి కష్టాలు వర్ణనాతీతంగా ఉంటున్నాయి. జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలతో రైతులు వానాకాలం సాగుకు సన్నద్ధమవుతున్నారు. కౌలు రైతులు ఇప్పటికే భూ యజమానులకు డబ్బులు చెల్లించి ఆయా భూముల్లో పనులు ప్రారంభించారు. కౌలు రైతులకు ప్రభుత్వ సహకారం అంతంతమాత్రమే కావడంతో ప్రైవేట్ వ్యక్తుల నుంచి అప్పులు తెచ్చి మరీ పంటలు సాగు చేస్తుండడంతో వారిపై తీవ్రంగా ఆర్థిక భారం పడుతోంది.

ప్రభుత్వ పథకానికి దూరం..!

సాధారణంగా భూమిలేని వారితో పాటు అరఎకరం, ఎకరం భూమి ఉన్నవారు ఇతర రైతుల వద్ద నుంచి భూమిని కౌలుకు తీసుకుని సాగు చేస్తుంటారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలో భాగంగా కౌలు రైతుల కోసం ఆత్మీయ భరోసా పేరిట రూ.12 వేలు ఇస్తామని హామీ ఇచ్చింది. భూమి లేని నిరుపేద కుటుంబాలై, ఉపాధిహామీ పథకంలో 20 రోజుల పనిదినాలు పూర్తి చేసిన వారిని ఈ పథకానికి అర్హులుగా గుర్తించారు. దీంతో జిల్లాలో సగానికి పైగా కౌలు రైతులకు ఈ పథకం ఉపయోగపడడం లేదని ఆరోపణలున్నాయి. కాగా జిల్లాలో దాదాపు 30వేలకు పైగా కౌలు రైతులు ఉన్నారని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు.

రూ. 15వేల వరకు ధర..

మూడేళ్ల క్రితం వరకు కౌలు ధరలు అంతంత మాత్రంగానే ఉండేవి. కానీ క్రమంగా కౌలు ధరలు పెరుగుతున్నాయి. ప్రాంతాన్ని బట్టి ఎకరానికి రూ. 8 వేల నుంచి రూ.15 వేల వరకు కౌలు ధర ఉంది. రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న రైతుభరోసా, కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న కిసాన్ సమ్మాన్ నిధి భూ యజమానులకే దక్కుతోంది. దీంతో కౌలు రైతులకు ఆర్థికసాయం అందని ద్రాక్షగానే మిగులుతోంది.

చివరిదాక కష్టాలే..

కౌలు రైతుకు సీజన్ ప్రారంభం నుంచి సీజన్ పూర్తయ్యే వరకు కష్టాలే ఎదురవుతున్నాయి. విత్తనాలు, ఎరువులు కొనుగోలుతో పాటు పంటలను విక్రయించేందుకు సైతం పట్టాదారు పాసు పుస్తకాలు తప్పనిసరిగా మారాయి. ఈ క్రమంలో పట్టాదారు పాసు పుస్తకాల జిరాక్స్‌లు ఇచ్చేందుకు భూ యజమానులు వెనుకడుగు వేస్తున్నారు. దీంతో ఎరువులు, విత్తనాలు కొనుగోలు కోసం, పండించిన పంటను అమ్ముకోవడానికి దళారులను ఆశ్రయించి కౌలు రైతులు మోసపోతున్నారు. పంట పెట్టుబడి కోసం బ్యాంకులు రుణాలు ఇవ్వకపోవడంతో ప్రైవేట్ వ్యక్తులను ఆశ్రయించి అధిక వడ్డీకి అప్పులు తెచ్చుకుంటున్నారు. దీంతో పాటు ఒక్కోసారి ప్రకృతి ప్రకోపానికి సాగు చేసిన పంటలను నష్టపోతుండడంతో కౌలు రైతుకు ఆశించిన ఫలితం రావడం లేదు.

ఐదెకరాల్లో కౌలు చేస్తున్నా..



నాకు ఎకరం భూమి ఉంది. మా ఊళ్లోనే మరో ఐదెకరాలను రూ. 50 వేలకు కౌలుకు తీసుకొని పత్తి పంట వేసిన. కౌలు డబ్బులు కాకుండా పంట సాగుకు రూ.90 వేల వరకు ఖర్చవుతోంది. మొత్తంగా ఐదెకరాల్లో పత్తి సాగుకు రూ.1.40 లక్షలు ఖర్చు వస్తుంది. అకాల వర్షాలతో వచ్చిన కాత సరిగా కాయకపోవడంతో కనీసం పెట్టుబడి కూడా రావడం లేదు. గత ఏడాది పంట దిగుబడి రాక రూ. 20 వేలు నష్టపోయాను. ప్రభుత్వం రైతుభరోసా ఇచ్చి ఆదుకోవాలి.

– కోట సుభాష్, కౌలు రైతు, దుగ్గపూర్, మం. రెబ్బెన

'ప్రాణహిత' ఎక్కడ?



బూరెపల్లి వద్ద సర్వే నిర్వహిస్తున్న బృందం

- తుమ్మిడిహెట్టి వద్ద ప్రతిపాదన..
- తాజాగా బూరెపల్లి వద్ద సర్వే..
- స్పష్టత లేని ప్రభుత్వ ప్రకటనలు
- జిల్లావాసుల్లో సందిగ్ధం



ప్రాణహిత నది

చింతలమానెపల్లి: రైతులకు సాగునీరందించాలనే ఉద్దేశంతో అప్పటి ముఖ్యమంత్రి దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి కౌటాల మండలం తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత నదిపై ప్రాణహిత –చేవెళ్ల ప్రాజెక్టు పనులకు శ్రీకారం చుట్టారు. కానీ ఆయన మరణానంతరం ప్రాజెక్టు నిర్మాణం కలగా మారింది. తాజాగా ప్రాణహిత నదిపై ప్రాజెక్టు నిర్మిస్తామనే ప్రభుత్వ ప్రకటనలు జిల్లావాసుల్లో ఆశలు కలిగిస్తున్నా స్పష్టత లేని ప్రకటనలతో ప్రజల్లో గందరగోళం నెలకొంటుంది. తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు నిర్మాణం చేపడుతామంటున్న నేపథ్యంలో ఇంజినీరింగ్ అధికారులు బూరుపల్లి వద్ద సర్వే చేస్తుండడంతో ప్రాజెక్టు నిర్మాణం ఎక్కడ చేపడుతారోనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

గతంలో నిధులు కేటాయింపు..

16, డిసెంబర్, 2008న రూ.38,500 కోట్ల వ్యయంతో నిర్మించతలపెట్టిన ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు కింద తెలంగాణలోని ఏడు జిల్లాల్లో 16.4 లక్షల ఎకరాలకు సాగునీరందించేలా లక్ష్యాన్ని నిర్దేశించారు. 2010 బడ్జెట్‌లో రూ.200 కోట్లు, 2011 బడ్జెట్‌లో మరో రూ.వెయ్యి కోట్లు కేటాయించారు. కాలువల నిర్మాణాల్లో భూములు కోల్పోతున్న కౌటాల, బెజ్జూర్, దహెగాం మండలాల్లోని రైతులకు ప్రభుత్వం ఎకరానికి రూ.1.27 లక్షలు చెల్లించింది. రన్‌వెల్లి నుంచి ఖర్జెల్లి వరకు 15 కిలోమీటర్లు కాలువల తవ్వకాల కోసం ప్రభుత్వం రూ.229 కోట్లు కేటాయించింది.

చిగురించిన ఆశలు

గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టును తుమ్మిడిహెట్టి నుంచి కాళేశ్వరానికి తరలించింది. దీనిపై విమర్శలు వచ్చాయి. ఇక గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా బీఆర్ఎస్ తుమ్మిడిహెట్టి సమీపంలోనే వార్ధా నదిపై ప్రాజెక్టు నిర్మాణం చేపడతామని ప్రకటించింది. ఈక్రమంలో కాళేశ్వరం మేడిగడ్డ ప్రాజెక్టు పిల్లర్లు కుంగిపోవడం.. బీఆర్ఎస్ ప్రభుత్వం మారిపోవడంతో తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టుపై జిల్లావాసుల్లో ఆశలు చిగురించాయి. దీనికి అనుగుణంగా ప్రస్తుత కాంగ్రెస్ మంత్రులు సైతం ప్రాణహిత నదిపై తుమ్మిడిహెట్టి వద్దనే ప్రాజెక్టు నిర్మిస్తామని ప్రకటనలు జారీ చేశారు. తాజాగా చింతలమానెపల్లి మండలం బూరెపల్లి వద్ద ప్రాణహిత నదిపై ప్రాజెక్టు నిర్మాణానికి సర్వే జరుగుతున్నట్లు ప్రకటనలు రావడం ప్రజల్లో గందరగోళానికి కారణమవుతోంది.

బూరెపల్లి వద్ద సర్వే..

రిటైర్డ్ ఇంజినీర్ కె.విఠల్‌రావు ప్రాణహిత నదిపై ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాల్సిన ఆవశ్యకతను వివరిస్తూ స్వచ్ఛందంగా సర్వే నిర్వహించి ప్రభుత్వానికి వివరాలు అందజేశారు. స్పందించిన రాష్ట్ర నీటిపారుదల శాఖ సాధ్యాసాధ్యాలను పరిశీలించి, నివేదిక అందజేయాలని జిల్లా నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించింది. జిల్లా నీటిపారుదల శాఖ అధికారులు డీఈ వెంకటరమణ, ఏఈఈ రాజ్‌కుమార్‌లు సర్వే చేపట్టారు. విఠల్‌రావు అందించిన వివరాల మేరకు జిల్లాలోని ప్రాణహిత నది పరీవాహక గ్రామాలు తుమ్మిడిహెట్టి, రణవెల్లి, బూరెపల్లి తదితర గ్రామాలలో 10రోజుల పాటు సర్వే చేశారు.

బూరెపల్లి వద్ద సానుకూలత..

తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు నిర్మాణంలో ఏవైనా ఇబ్బందులు తలెత్తితే ప్రత్యామ్నాయంగా మరో స్థలాన్ని ఎంచుకోవచ్చని సర్వే చేసిన ఇంజినీరింగ్ అధికారుల బృందం అభిప్రాయాలు వ్యక్తం చేసింది. ఇప్పటి వరకు నిర్వహించిన వివరణాత్మక దర్యాప్తులో పలు వివరాలు సేకరించినట్లుగా బృందం తెలిపింది. బూరెపల్లి వద్ద పునాదులకు అనుకూలమైన రాతి నేలలు, ప్రాజెక్టుకు అవసరమైన నీటిలభ్యత ఉన్నట్లుగా అధికారులు గుర్తించారు. గతంలో ప్రతిపాదించిన 148 మీటర్ల ఎత్తులో బూరెపల్లి వద్ద ప్రాజెక్టు నిర్మించవచ్చని, ఈమేరకు మహారాష్ట్ర వైపు నుంచి అభ్యంతరాలు ఉండవని పేర్కొన్నారు. ప్రతిపాదిత బ్యారేజీ, 5కిలోమీటర్ల అప్రోచ్, గంగాపూర్ గ్రామం సమీపంలో పంప్‌హౌజ్, 12.5 కిలోమీటర్ల దూరం కాలువలు, లింక్ మొత్తంగా రూ.4500 కోట్ల అంచనాతో పనులు చేపట్టవచ్చని రిపోర్టు రూపొందించారు.

తుమ్మిడిహెట్టి వద్ద నిర్మించాలి..



కాళేశ్వరం వద్ద నిర్మించిన ప్రాజెక్టు కుంగిపోయిన నేపథ్యంలో ప్రాణహిత నీటిని వినియోగించుకోవడానికి తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు నిర్మాణమే పరిష్కారం. ప్రాణహిత నదిపై గతంలో ప్రతిపాదించిన మేరకు ప్రాజెక్టు నిర్మించాలి. జిల్లాలోని వ్యవసాయ భూములకు, ఇతర అవసరాలకు నీటిని అందించవచ్చు. ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలని త్వరలో సీఎం రేవంత్ రెడ్డిని కలిసి విన్నవిస్తాం. ప్రాజెక్టు నిర్మాణం త్వరగా చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం.

– పాల్వాయి హరీశ్‌బాబు, ఎమ్మెల్యే

బూరెపల్లి వద్ద నిర్మించవచ్చు..



ప్రాణహిత నదిపై ప్రాజెక్టు నిర్మిస్తే కుమురంభీం జిల్లాతో పాటు ఇతర జిల్లాల్లో నీటిని పూర్తిస్థాయిలో వినియోగించుకోవచ్చు. ప్రాజెక్టు నిర్మాణానికి తుమ్మిడిహెట్టిపై అభ్యంతరాలు వ్యక్తమైతే బూరెపల్లి వద్ద పూర్తి అనుకూలంగా ఉంది. ఈమేరకు స్వచ్ఛందంగా సర్వే నిర్వహించి ప్రభుత్వానికి వివరాలు అందించాం. ప్రభుత్వ దర్యాప్తులో భాగంగా అధికారులతో కలిసి సర్వే నిర్వహిస్తున్నాం.

– కె.విఠల్ రావు, రిటైర్డ్ నీటిపారుదలశాఖ ఇంజినీర్

ప్రభుత్వం అనుకూలం..



ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం తుమ్మిడిహెట్టి వద్దనే ప్రాజెక్టు నిర్మాణానికి అనుకూలంగా ఉంది. ఈమేరకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సైతం సమీక్ష నిర్వహించి ప్రకటించారు. దివంగత కాంగ్రెస్ సీఎం వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో శంకుస్థాపన చేసిన స్థలంలోనే ప్రారంభిస్తాం. ప్రాజెక్టు నిర్మాణంపై చిత్తశుద్ధిగా ఉన్నాం.

– దండె విఠల్, ఎమ్మెల్సీ

తెగిన గుండి వాగు తాత్కాలిక వంతెన



కొట్టుకుపోయిన పైపులు

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని గుండి వాగుపై ఏర్పాటు చేసిన తాత్కాలిక వంతెన కొట్టుకుపోయింది. ప్రతీ సంవత్సరం ఎండాకాలం వాగులో పైపులతో తాత్కాలిక వంతెన ఏర్పాటు చేసి రాకపోకలు కొనసాగిస్తుంటారు. శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వాగులో నీటి ప్రవాహం ఎక్కువై వంతెన పైనుంచి నీరు ప్రవహిస్తోంది. అదే గ్రామానికి చెందిన జాడి సంతోష్ ఉదయం 6 గంటలకు తన ఆటోలో ఆసిఫాబాద్ వెళ్లేందుకు వంతెన దాటుతుండగా ఒక్కసారిగా వంతెన కుంగిపోయింది. నీటి ప్రవాహంలో ఆటో కొంతమేర కొట్టుకుపోగా ట్రాక్టర్ సాయంతో గ్రామస్తులు ఆటోను బయటకు తీశారు. కాగా ప్రస్తుతం గుండి గ్రామానికి రాకపోకలు నిలిపివేశారు.

క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రంలో చోరీ



కోటపల్లి: మండలంలోని రోయ్యపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో చోరీ జరిగింది. శనివారం ఉదయం కేంద్రం తలుపులు పగులకొట్టి ఉండటంతో స్థానికులు నిర్వాహకురాలు విజయలక్ష్మికి సమాచారం అందించారు. ఆమె అక్కడికి వచ్చి చూడగా కేంద్రంలో 17 పాల ప్యాకెట్లు, 10 పప్పు ప్యాకెట్లు, 5 ట్రేల కోడిగుడ్లను గుర్తుతెలియని దుండుగలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

కాలేజీరోడ్‌లో..

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని కాలేజీరోడ్‌లో ఈనెల 22న చోరీ జరిగినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. కాలేజీరోడ్‌కు చెందిన ముక్తా ప్రసాద్ జైపూర్ మండలం ఇందారంలో రేషన్ షాపులో పనిచేసేవాడు. ప్రసాద్ ప్రతీ రోజు ఉదయం ఇందారం వెళ్లి సాయంత్రం వచ్చేవాడు. ఈనెల 21న ప్రసాద్ భార్య ఇంటికి తాళం వేసి బయటకు వెళ్తూ పక్కనే ఉన్న చందా ప్రసన్నలక్ష్మికి తాళం చెవి ఇచ్చింది. ఈనెల 22న ఉదయం ఇంట్లో బీరువాలో 120 గ్రాముల బంగారు ఆభరణాలు కనిపించలేదు. సుమారు వీటి విలువ రూ.7.20 లక్షలు ఉంటుందన్నారు. ప్రసన్నలక్ష్మి, మరో వ్యక్తిపై అనుమానం ఉందని బాధితుడు ప్రసాద్ ఫిర్యాదుతో శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సైకిల్‌ను ఢీకొట్టిన ఆటో



రాజన్న (ఫైల్)

జన్నారం: సైకిల్‌ను ఆటో ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతిచెందాడు. జన్నారం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఎస్సై రాజవర్ధన్ కథనం ప్రకారం.. మండలంలోని అక్కపెల్లిగూడకు చెందిన గోలి రాజన్న (55) పాత ఇనుప సామాను దుకాణంలో పని చేస్తున్నాడు. శుక్రవారం రాత్రి పని ముగించుకుని సైకిల్‌పై ఇంటికి వస్తున్నాడు. జన్నారం వైపు వస్తున్న ఆటో వెనుకవైపు నుంచి సైకిల్‌ను ఢీకొట్టడంతో రాజన్నకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకుని అతన్ని జన్నారంలో ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం లక్సెట్టిపేట ఆసుపత్రికి పంపించారు. వైద్యులు పరిశీలించి మృతి చెందినట్లు నిర్ధారించారు. ప్రమాదానికి కారణమైన ఆటో బాదవత్ జనంత్‌రావుకు చెందినదిగా గుర్తించినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి భార్య కళావతి ఫిర్యాదుతో శనివారం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి ఒక కుమారుడు, ఒక కూతురు ఉండగా పెళ్లయింది.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

బెజ్జూర్: మండలంలోని కుశ్నపల్లి సమీపంలో శుక్రవారం సాయంత్రం గంజాయి తరలిస్తున్న వ్యక్తిని పట్టుకుని అరెస్టు చేసినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. పక్కా సమాచారంతో వాహనాలు తనిఖీ చేపట్టినట్లు పేర్కొన్నారు. సులుగుపల్లికి చెందిన మాజీ ఉప సర్పంచ్ సిడాం సంతోష్ బైక్‌పై తరలిస్తున్న రూ.3,86,970 విలువ చేసే 3.47 కిలో గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరుపర్చగా రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

సాహిత్యంలో 'అరుణ' కిరణం!

- ఆకట్టుకుంటున్న బట్టువార్ బాల సాహిత్యం..
- విద్యార్థుల్లో సాహిత్య బీజాలు నాటుతున్న ఉపాధ్యాయురాలు..
- తాను రచిస్తూ.. పిల్లల్లో సాహిత్యం పెంపొందించేలా ప్రేరణ..
- ఐదు భాషల్లో మధుర గేయాల పుస్తకాలు ముద్రణ
- సొంతంగా 1,937 కవితలు రాసిన టీచర్..
- నేడు 'తెలంగాణ సారస్వత పరిషత్' ఆధ్వర్యంలో సన్మానం



తెలుగులో గేయం రాసిన మన్నూర్ పాఠశాల విద్యార్థులు(ఫైల్)



ముద్రించిన బాలగేయాల పుస్తకాలతో అరుణ

ఇంద్రవెల్లి: ఆదిలాబాద్ జిల్లా భీంసరికి చెందిన ఉపాధ్యాయురాలు అరుణ బట్టువార్ ప్రాథమిక స్థాయి విద్యార్థులను బాల కవులు, సాహిత్యవేత్తలుగా తీర్చిదిద్దేందుకు విశేష కృషి చేస్తున్నారు. ప్రస్తుతం ఇంద్రవెల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్న ఆమె.. బాలల్లో సాహిత్య ఆసక్తిని పెంపొందిస్తున్నారు. ఆమె స్వయంగా 1,937 కవితలు రాసి, 10 సాహిత్య పుస్తకాలను ప్రచురించారు. విద్యార్థుల ద్వారా ఐదు భాషల్లో ఆరు బాల గేయ పుస్తకాలను ముద్రించారు. ఆమె సేవలను గుర్తించి, 'తెలంగాణ సారస్వత పరిషత్'82వ స్థాపన దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో ఆదివారం జరిగే బాల సాహిత్య సమ్మేళనంలో సన్మానించనుంది.

సాహిత్య సేవలకు గుర్తింపు

అరుణ బట్టువార్ 1997లో ఎంఏ, బీఎడ్ పూర్తి చేసి ఉపాధ్యాయ వృత్తిలోకి ప్రవేశించారు. కథలు, నాటికలు రాసి రేడియో ప్రోగ్రామ్‌ల ద్వారా ప్రసారం చేశారు. ఆమెకు విశ్వవిఖ్యాత గౌతమి నంది, ఎస్వీఆర్ డిజిటల్ అండ్ గౌతమేశ్వర కామధేను, ప్రైడ్ ఇండియా, కలం భూషణ్, సాహితీ కిరణం, గుడిహత్నూర్ బెస్ట్ టీచర్, సావిత్రిబాయి పూలే, చతుర్ముఖ సింహ, కథరత్న, మధుర కవయిత్రి వంటి అనేక అవార్డులు లభించాయి. తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్, విశ్వవిఖ్యాత కీర్తి, తెలుగు వెలుగు జాతీయ సాహిత్య పురస్కారాలు, ఆర్ఎస్ఎన్ సేవ ఫౌండేషన్ కవితా పురస్కారాలు కూడా ఆమె సొంతం చేసుకున్నారు.

ఐదు భాషల్లో బాల గేయాలు

అరుణ బట్టువార్ పనిచేసిన పాఠశాలల్లో విద్యార్థులతో కవితలు, సాహిత్య రచనలు చేయించారు. 2021–24 మధ్య గుడిహత్నూర్ మండలం మన్నూర్ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తూ, విద్యార్థులతో తెలుగు, హిందీ, మరాఠీ, ఇంగ్లిష్ భాషల్లో గేయాలు రాయించారు. వాటిని 'మన్నూర్ బాలల మధుర గేయాలు', 'మన్నూర్ చిల్డ్రన్స్ మెలోడీయస్ రైమ్స్'వంటి పుస్తకాలను ముద్రించారు. 2013లో సీతారాంగూడ పాఠశాలలో గోండి భాషలో 'చుదూర్ కాండీరా... చుదూర్ పాటింగ్'గేయాల పుస్తకాన్ని రాయించారు. ఇంద్రవెల్లిలో గత విద్యా సంవత్సరంలో పదో తరగతి విద్యార్థులతో అలంకార కవితలు రాయించి పుస్తకం ముద్రించారు.

సాహిత్య బీజం నాటి..

అరుణ బట్టువార్ సాహిత్య ప్రతిభను విద్యార్థుల్లో నాటడం ద్వారా బాల సాహిత్యానికి కొత్త ఒరవడిని సృష్టిస్తున్నారు. ఆమె కృషిని జిల్లా వాసులు, తోటి ఉపాధ్యాయులు ప్రశంసిస్తున్నారు. ఆమె బోధన, సాహిత్య రచనలు భావి తరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయి.

సంతోషించారు



గోండి భాషకు లిపి లేదు. మాతో గోండి భాషలో బాలగేయాలు రాయించాలని టీచర్ కృషి చేశారు. తెలుగులో చెబుతుంటే మేము గోండి భాషలో రాశాం. మా తప్పులు సరిచేస్తూ మళ్లీ రాయిస్తూ చక్కటి బాలగేయ పుస్తకాలను టీచర్‌తో కలిసి సమాజానికి అందించాం. మేం రాసిన పుస్తకం చదివి మా గ్రామస్తులు సంతోషించారు

– కినక గణేశ్, సీతారాంగూడ విద్యార్థి

బాల కవులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

పిల్లల్లో సాహిత్యాన్ని పెంపొందిస్తాం. చక్కని కథలు, గేయాలు, వచన కవితలు రాసేటట్టు తర్ఫీదునిస్తాం. పిల్లలను బాల కవులుగా తీర్చిదిద్దడమే తన లక్ష్యం. సాహితీ పుస్తకాలు చదవడం, రాయడంతో నైపుణ్యం పెరుగుతుంది.

– అరుణ బట్టువార్, ఇంద్రవెల్లి జెడ్పీ పాఠశాల ఉపాధ్యాయురాలు

టీచర్ కృషితోనే..



తెలుగులో అలంకారాలు నేర్చుకోవడంలో టీచర్ సులువు పద్ధతి చెప్పేవారు. ఉదాహరణలు ఇస్తూ వాటి ద్వారా కవితలు రాయిస్తే గుర్తుంటాయని మాతో కవితలు రాయించేది. మొదట్లో కొంత తికమకపడ్డాం. మేడం సలహాలతో 20 మంది పదో తరగతి విద్యార్థులు వివిధ అలంకార కవితలు రాశాం. ఇలా రాయడంలో టీచర్ కృషి ఉంది.

– చంద్రకాంత్, మన్నూర్ పాఠశాల విద్యార్థి

పట్టు సాధించాం



టీచర్‌తోనే సాహిత్యం, బాలగేయం పరిచయమైంది. ఆమె ప్రోత్సాహంతో బాలగేయాలు రాసేవాళ్లం. అందులో తప్పులు సరిచేస్తూ మళ్లీ రాయించేది. ఇలా రాయడం ద్వారా సాహిత్యం, బాల గేయాలపై పట్టు సాధించగలిగాం. ఆంగ్ల బాలగేయ పుస్తకాన్ని ముద్రించగలిగాం. టీచర్ కృషితో ఇది సాధ్యమైంది.

– పెందోర్ లక్ష్మి, మన్నూర్ విద్యార్థిని

ఎస్టీపీపీలో వర్క్స్ కమిటీ సమావేశం నిర్వహించాలి



రియాజ్ అహ్మద్

జైపూర్: ఎస్టీపీపీలో వర్క్స్ కమిటీ సమావేశం నిర్వహించాలని హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2016–20 వరకు స్టీగ్ కంపెనీ నుంచి కార్మికులకు ఫుల్అండ్ ఫైనల్ సెటిల్మెంట్ ఇప్పటివరకు చెల్లించలేదన్నారు. ఒక్కో కార్మికుడికి రూ.70వేలకు పైగా వస్తాయని, ఆ డబ్బులు సింగరేణి యాజమాన్యం కాజేసిందా అని ప్రశ్నించారు. పవర్‌మేక్ కంపెనీ సబ్ కాంట్రాక్టు వీవీఆర్ అనే కంపెనీ 2016–23 వరకు కార్మికులకు ఫుల్అండ్ ఫైనల్ సెటిల్మెంట్ చేయలేదన్నారు. కంపెనీ నిబంధనలు ప్రకారం బోనస్ 8.33 ఇవ్వాలని అలా చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. పవర్‌మేక్ కంపెనీ వెంటనే డబ్బులు చెల్లించాలని లేకపోతే కార్మికులు ఆందోళన చేపడుతారని హెచ్చరించారు.

పులిని హతమార్చిన 30 మంది అరెస్టు

కాగజ్‌నగర్‌టౌన్: పెంచికల్‌పేట మండలంలోని ఎల్లూరు అటవీప్రాంతంలో విద్యుత్ తీగల ఉచ్చుతో పులిని హతమార్చిన 30 మందిని శనివారం అరెస్టు చేసినట్లు కాగజ్‌నగర్ ఫారెస్టు డివిజన్ అధికారి సుశాంత్ సుఖ్‌దేవ్ బోబాడే తెలిపారు. అప్పాజి శ్రీనివాస్, వెంకటేశ్,ఎల్కరి శేఖర్, రోహిని శ్రావణ్, చప్పిడె అశోక్, పవన్‌కుమార్,ఎల్కరి ప్రకాశ్, వెంకటేశ్, కాటెల సాగర్, నికాడి వెంకటేశ్, లా త్కరి శ్రీనివాస్, భీంకరి వెంకటేశ్, భీంకరి రంగయ్య, లేగల గోపాల్, రాచకొండ లచ్చయ్య, ఓండ్రె సంతోశ్, తుమ్మిడె శ్రీనివాస్, ఎల్కరి సుగుణాకర్, బుర్రి తిరుపతి, ఓండ్రె నారాయణ, లేగల వెంకటేశ్, గోమాసు రాజన్న, మడె మధునయ్య, లేగల సత్యనారాయణ, ఎల్లూరి లచ్చన్న, మౌల్కార్ దివాకర్, బిన్కర్ తిరుపతి, తుమిడె సత్తయ్య, పెద్దల నీలయ్య, గావుడె శంకర్ ఉన్నారన్నారు. సిర్పూర్(టి) సివిల్‌కోర్టులో హాజరుపర్చామని, 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించగా, ఆసిఫాబాద్ జైలుకు తరలించినట్లు తెలిపారు.

బాక్సింగ్ చాంపియన్లుగా నిలవాలి



బాక్సింగ్ పోటీల్లో గెలుపొందిన వారిని ప్రకటిస్తున్న నిర్వాహకులు



మాట్లాడుతున్న డీవైఎస్‌వో కీర్తి రాజ్‌వీర్

మంచిర్యాలటౌన్: బాక్సింగ్ పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన క్రీడాకారులు చాంపియన్లుగా నిలిచి, జాతీయస్థాయిలోనూ రాణించాలని జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి కీర్తిరాజ్‌వీర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎఫ్‌సీఏ ఫంక్షన్ హాల్‌లో ఉమ్మడి జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ పర్యవేక్షణలో టైసన్ కప్–2025 చాంపియన్‌షిప్ రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలను శనివారం సాయంత్రం ప్రారంభించారు. ఈనెల 26వ తేదీ వరకు నిర్వహించనున్న బాక్సింగ్ పోటీలకు రాష్ట్రస్థాయి నుంచి 250 మంది క్రీడాకారులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గాప్రసాద్, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ పురుషోత్తం నాయక్, నిర్వాహకుడు చిలువేరు రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో పశువులు మృతి



లక్ష్మణచాంద: గేదె కళేబరం



దిలావర్‌పూర్:ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎద్దు కళేబరం

లక్ష్మణచాంద: మండలంలోని పార్‌పెల్లితండాలో విద్యుత్ షాక్‌తో గేదె మృతిచెందింది. గేదె ఎప్పటిలాగే శుక్రవారం ఉదయం మేతకు వెళ్లి ంది. తిరిగి సాయంత్రం ఇంటికి రాకపోవడంతో రైతు బానావత్ రాంజీ చుట్టూపక్కల వెతి కాడు. శనివారం అటు వైపుగా వెళ్లిన గ్రామస్తులకు గేదె మృతి చెంది కనిపించడంతో రైతుకు సమాచారమిచ్చారు. మేత మేసేక్రమంలో వి ద్యుత్ షాక్ తగలి మృతి చెందినట్లు గుర్తించా రు. దీని విలువ రూ.55 వేలు ఉంటుందని ప్ర భుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరాడు.

దిలావర్‌పూర్‌లో..

దిలావర్‌పూర్: మండల కేంద్రానికి చెందిన రైతు నంద ముత్యం ఎద్దు శనివారం విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. ఎప్పటిలాగే తన పంటచేలకు ఎడ్ల బండితో వెళ్లి అక్కడ వ్యవసాయ పనులు చేస్తున్నాడు. మేతకోసం ఎద్దులను పొలంలో ఉంచగా ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లింది. అక్కడ 11 కేవీ విద్యుత్ తీగలకు ఎద్దు తోక తగిలి అక్కడికక్కడే మృతిచెందింది. ఎద్దు కిందపడిపోగానే అక్కడకు చేరుకున్న రైతు ఏం జరిగిందో తెలియక వేలాడుతున్న విద్యుత్ తీగను చూసి భయాందోళనకు గురయ్యాడు. వెంటనే విద్యుత్ సరఫరా నిలుపుదల చేయాలని అధికారులకు సమాచారమిచ్చారు. మృతి చెందిన ఎద్దు విలువ రూ.80 వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు.



కడెం: ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఆవు..

కడెంలో..

కడెం: మండలంలోని అల్లంపల్లి జీపీ పరిధి పాలరేగడి గ్రామ గిరిజన రైతు పెంద్రం మధుకు చెందిన ఆవు విద్యుత్ షాక్‌తో మృతిచెందింది. దత్తోజిపేట సమీపంలో శుక్రవారం ఆవు మేతకు వెళ్లి సాయంత్రం ఇంటికి వస్తుండగా ట్రాన్స్‌ఫార్మర్ విద్యుత్ తీగలకు తగిలి షాక్‌తో మృతిచెందింది. దీని విలువ రూ.40 వేలు ఉంటుందని, ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని బాధిత రైతు వేడుకున్నాడు.

20 క్వింటాళ్ల నకిలీ పత్తివిత్తనాలు పట్టివేత



స్వాధీనం చేసుకున్న నకిలీ పత్తి విత్తనాలు

కాగజ్‌నగర్‌రూరల్: కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రూ.60 లక్షల విలువైన 20 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. కాగజ్‌నగర్ రూరల్ సర్కిల్ కార్యాలయంలో ఎస్పీ డీవీ.శ్రీనివాస్‌రావు శనివారం వివరాలు వెల్లడించారు. నకిలీ విత్తనాలు సరఫరా అవుతున్నాయని టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం అందడంతో కాగజ్‌నగర్ సమీపంలోని పెద్దవాగు సమీపంలో తనిఖీ చేపట్టారు. ఈ సమయంలో అటుగా వచ్చిన ఏపీ39 టీవై 9741 నంబర్ ఐచర్ వ్యాన్‌ను తనిఖీ చేయగా అందులో 20 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలు ఉన్నట్లు గుర్తించారు. విత్తనాలకు సంబంధించిన వివరాలు తెలుపకపోవడంతో కాగజ్‌నగర్ పట్టణంలోని కాపువాడకు చెందిన కొత్తపల్లి సదాశివ్, కర్నూల్ జిల్లా అదోనికి చెందిన డ్రైవర్ పుప్పాల లక్ష్మణ్, మహారాష్ట్రలోని అహేరికి చెందిన సంతోష్‌కిశోర్‌ను అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. మరో నిందితుడు వేణుగోపాల్‌రెడ్డి పరారీలో ఉన్నారని తెలిపారు. జిల్లాలో ఎవరైనా నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం, టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్, కాగజ్‌నగర్‌రూరల్ సీఐ శ్రీనివాస్‌రావు, టాస్క్‌ఫోర్స్ ఎస్సై వెంకటేశ్, రూరల్ ఎస్సై సందీప్ పాల్గొన్నారు.

ఇచ్చోడ: మండలంలోని కోకస్‌మన్నూర్, ఇస్లాంనగర్ గ్రామాల్లో ఆదిలాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆధ్వర్యంలో శనివారం నకిలీ విత్తనాలు పట్టుకున్నట్లు తెలిసింది. ఉదయం 8 గంటలకు ఏకకాలంలో దాడులు నిర్వహించి నకిలీ బీజీ–3 విత్తనాలను పట్టుకున్నట్లు సమాచారం. ఈ దాడుల్లో 18 నకిలీ విత్తనాల బ్యాగులతో పాటు ముగ్గురిని అదుపులో తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. ఈ విషయమై స్థానిక ఎస్సై పురుషోత్తం వివరణ కోరగా ఆకస్మికంగా దాడులు జరిపిన మాట వాస్తవమన్నారు. విచారణ కొనసాగుతుందని పేర్కొన్నారు.


నడుమునొప్పి భరించలేక ఆత్మహత్య



గరికె లక్ష్మణ్ మృతదేహం

తానూరు: నడుమునొప్పి భరించలేక యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏఎస్సై భానుప్రసాద్ కథనం ప్రకారం.. మండలంలోని వడ్‌ఝురి(బి) గ్రామానికి చెందిన గరికె లక్ష్మణ్ (29) రెండేళ్లుగా నడుమునొప్పితో బాధపడుతున్నాడు. గతేడాది శస్త్రచికిత్స చేయించుకున్నా నయం కాలేదు. ఆ తర్వాత వ్యవసాయ పనులు చేస్తుండగా కట్ల పాము కాటేసింది. కాళ్లవాపు తగ్గలేదు. వైద్య పరీక్షలు నిర్వహించుకోగా వ్యాధి నయం కాలేదు. అటు నడుమునొప్పి, ఇటు కాళ్లవాపు తగ్గకపోవడం తీవ్ర మనస్తాపంతో శుక్రవారం సాయంత్రం వ్యవసాయ పొలానికి వెళ్లి పురుగుల మందు తాగాడు. రాత్రయినా లక్ష్మణ్ ఇంటికి తిరిగి రాకపోవడంతో తండ్రి బాలాజీ వెతుకుంటూ వ్యవసాయ పొలానికి వెళ్లాడు. అక్కడ స్పృహ కోల్పోయిన లక్ష్మణ్‌ను భైంసా ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. భార్య నాగమణి ఫిర్యాదుతో శనివారం కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

పాముకాటుకు మధ్యప్రదేశ్‌వాసి మృతి




విష్ణుప్రసాద్ మృతదేహం

తాండూర్: పాము కాటుకు మధ్యప్రదేశ్ వాసి మృతి చెందినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వర్కడే విష్ణుప్రసాద్ (52) బతుకుదెరువు కోసం తాండూర్ మండలం రేపల్లెవాడకు వలసవచ్చాడు. ప్రైవేట్ జిన్నింగ్ మిల్లులో కూలీ పనులు చేస్తూ రేపల్లెవాడలో అద్దెకు ఉంటున్నాడు. శుక్రవారం రాత్రి ఇంట్లో నిద్రించిన విష్ణుప్రసాద్ శనివారం తెల్లారేసరికి పాముకాటుకు గురై మృతి చెంది ఉన్నాడు. స్థానికులు ఈ విషయాన్ని పోలీసులకు సమాచారమిచ్చారు. మృతుడి సోదరుడు మాన్‌సింగ్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కుళ్లిన చికెన్, పాడైన గుడ్లు



అన్నంలో వచ్చిన బొద్దింక



కుళ్లిన చికెన్

- దాబాలో నాసిరకం ఆహార పదార్థాలు
- తాజాగా అన్నంలో బొద్దింక ప్రత్యక్షం

బోథ్: సొనాల మండలంలోని ఓ పెట్రోల్ పంపు సమీపంలో గల దాబాలో కుళ్లిన చికెన్, పాడైన గుడ్లు దర్శనమిచ్చాయి. అంతేకాదు దాబాలో తింటున్న ఓ యువకుడి అన్నంలో బొద్దింక వచ్చింది. బోథ్ మండలంలోని కౌఠ(బి) గ్రామానికి చెందిన యువకుడు శనివారం సొనాల మండలం గుట్టపక్క తండా సమీపంలో ఓ పెట్రోల్ పంపు వద్ద ఉన్న దాబాకు వెళ్లాడు. భోజనం చేస్తుండగా అన్నంలో బొద్దింక ప్రత్యక్షంతో కంగుతిన్నాడు. వెంటనే దాబా సిబ్బందిని పిలిచి ఇదేంటని అడిగితే, అనుకోకుండా వచ్చిందని నిర్లక్ష్యంగా సమాధానమివ్వడంతో ఆగ్రహం వ్యక్తం చేశాడు. యువకుడు పలువురు స్థానికులు, విలేకరులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని తనిఖీ చేయగా బొద్దింక ఉన్న అన్నంతోపాటు, రిఫ్రిజిరేటర్‌లో కుళ్లిన చికెన్ మాంసంతోపాటు పాడైన ఉడకబెట్టిన గుడ్లు కనిపించాయి. అప్పటికే దాబాలో తింటున్న వారు అవాక్కయ్యారు. మధ్యలో భోజనం ఆపివేశారు. భోజనంలో బొద్దింక రావడంపై సదరు సిబ్బందిని అడుగగా నిర్లక్ష్యపు సమాధానం ఇచ్చారని వారు తెలిపారు. అధికారులు వెంటనే దాబాను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు.

కార్మికులకు అండగా ఉండాలి



నియామక పత్రాలు అందజేస్తున్న జనక్‌ప్రసాద్

శ్రీరాంపూర్: కార్మికులకు ఎల్లవేళలా అండగా ఉండాలని ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ బి.జనక్‌ప్రసాద్ తెలిపారు. శుక్రవారం రాత్రి రసూల్‌పల్లెలోని తన నివాసంలో శ్రీరాంపూర్ డివిజన్ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు ఏ సమస్య వచ్చినా యజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలన్నారు. కార్మికుల చిరకాల వాంఛ అయిన సొంతింటి పథకం అమలు కోసం కృషి చేస్తున్నామన్నారు. అలవెన్స్‌లపై ఆదాయ పన్ను రీయింబర్స్‌మెంట్, రూ.25 లక్షల వడ్డీ లేని రుణం తదితర అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఎన్నికల వేళ కార్మికులకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తామన్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులకు యూనియన్ పదవులు అప్పగించి నియామకపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ బ్రాంచి ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు, కేంద్ర కమిటీ నాయకులు భీంరావు గరిగే స్వామి, కలవేన శ్యామ్, ఏనుగు రవీందర్‌రెడ్డి, జీవన్‌జోయల్, తిరుపతిరాజు, నాయకులు పేరం రమేశ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

తాత్కాలికంగా సింగరేణి ప్యాసింజర్ రైలు రద్దు

బెల్లంపల్లి: భద్రాచలం రోడ్ నుంచి సిర్పూర్ కాగజ్‌నగర్ మధ్య రాకపోకలు సాగించే సింగరేణి ప్యాసింజర్ రైలు (నెం.17033/17034)ను తాత్కాలికంగా రద్దు చేశారు. మహబూబాబాద్ రైల్వేస్టేషన్ సమీపంలో నాన్ ఇంటర్ లాకింగ్, రైల్వేట్రాక్ పునరుద్ధరణ పనులు జరుగుతుండటంతో రైలును రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. ఈమార్గంలో ఎక్క డ నాన్ ఇంటర్ లాకింగ్, రైల్వేట్రాక్ పనులు చేపట్టినా సింగరేణి ప్యాసింజర్ రైలును తాత్కాలికంగా కొన్నిరోజుల పాటు రద్దు చేయడం రైల్వే అధికారులకు పరిపాటిగా మారిందనే విమర్శలు వస్తున్నాయి. ఈకారణంగా భద్రాద్రి కొత్తగూడెం వెళ్లడానికి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డా యి. ముఖ్యంగా కోల్‌బెల్ట్‌ప్రాంతాల వాసులకు సింగరేణి పరంగా కొత్తగూడెం వెళ్తుంటారు. ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని సత్వరంగా సింగరేణి ప్యాసింజర్ రైలును పునరుద్ధరించాలని పలువురు కోరుతున్నారు.